


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



సోమవారం 07-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :81 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## నేటి నుంచే అసెంబ్లీ హీట్!



2 లో

- వాడీవేడిగా తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
- 21 ఏళ్లకే ఎమ్మెల్యే పోటీకి ప్రతిపాదన
- 22-ఏ భూములపై హాట్ డిబేట్!
- ల్యాండ్ పూలింగ్, భూసేకరణపై చర్చ
- హైడ్రా, ఆస్తిపన్నుపై కీలక చర్చ
- సాగునీటి ప్రాజెక్టులపై సర్కార్‌ను నిలదీత?

## అసెంబ్లీలో కేసీఆర్ బిగ్ ప్లాన్!

- అసెంబ్లీకి అందరూ రావాలి
- సంఖ్యాబలంపై కేసీఆర్ ఫోకస్
- ప్రజా సమస్యలపై గళం విప్పాలి
- హామీలపై సర్కార్‌ను నిలదీయాలి
- సంక్షేమ పథకాలపై ప్రశ్నించాలి
- స్పీకర్ తీరుపై అప్రమత్తంగా ఉండాలి
- హక్కుల కోసం పోరాడాలి



2 లో

**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అధ్యక్షతన ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరుగుతోంది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులతో కేసీఆర్ చర్చిస్తున్నారు. సభలో పార్టీ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు ఆయన దిశానిర్దేశం చేస్తున్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన భోజనం చేశారు.

నేటి నుంచి తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన పలు సూచనలు చేశారు. సభలో అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే అంశాలపై ఎమ్మెల్యేలకు మాజీ సీఎం మార్గనిర్దేశం చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై చర్చించినట్లు సమాచారం.

## కేసీఆర్ మారకుంటే పదేళ్లు రోడ్లపైనే!

- సభకు రావాలన్న శ్రీధర్‌బాబు
- ఫాంహౌస్‌కే కేసీఆర్ పరిమితం
- సభలోనే సమాధానం చెప్తామన్న మంత్రి
- పదేళ్ల పాలనపై బీఆర్ఎస్‌ను నిలదీత
- రేషన్ కార్డులపై శ్రీధర్‌బాబు ప్రశ్నలు
- నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపణ
- విష్రప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు

2 లో

## పేపర్ మిల్లుపై పీసీబీ కొరడా!

- పేపర్ మిల్లుకు రూ.21 కోట్ల జరిమానా
- పదేపదే నిబంధనల ఉల్లంఘన
- గోదావరిలో వ్యర్థాలపై సీరియస్
- షోకాజ్ నోటీసులు ఇచ్చినా మార్పుల్లేవు
- తాజా తనిఖీల్లోనూ ఉల్లంఘనలు
- వ్యర్థాల విడుదలకు నో ఛాన్స్
- కాలుష్యంపై రాజీ లేదన్న పీసీబీ




2 లో

**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ మిల్లుపై కాలుష్య నియంత్రణ మండలి కఠిన చర్యలు చేపట్టింది. పర్యావరణ నిబంధనలను పదేపదే ఉల్లంఘించిందని నిర్ధారించిన పీసీబీ.. పేపర్ మిల్లు పరిశ్రమకు రూ.21 కోట్లకు పైగా పర్యావరణ పరిహారం విధించింది. గోదావరిలో వ్యర్థాల విడుదలకు అనుమతి లేదని స్పష్టం చేస్తూ.. కాలుష్య నియంత్రణ చర్యలను మరింత కఠినతరం చేసింది.

రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ మిల్లుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రూ.21.01 కోట్ల పర్యావరణ పరిహారం క్రింద జరిమానా విధించింది. పర్యావరణ నిబంధనలను పదేపదే ఉల్లంఘించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పీసీబీ వెల్లడించింది.

## జైలు కోసం చోరీ.. యువతి అరెస్ట్!

- కష్టమర్‌లా వచ్చి నగల బాక్స్‌తో పరార్
- యజమాని దృష్టి మళ్లగానే చోరీకి స్కెచ్
- 500 మీటర్లు వెంటాడి యువతిని పట్టుకున్న యజమాని
- చేతిలో నగలు.. బ్యాగులో కారం, స్ప్రే!
- 'నాకు జైలుకెళ్లాలని ఉంది'.. యువతి షాకింగ్ రీజన్
- యువతితో వచ్చిన మరో వ్యక్తి పరార్
- వైరల్‌గా మారిన జ్యువెలరీ షాప్ సీసీటీవీ దృశ్యాలు

2 లో

## కళ్లముందే పెరుగుతున్న జనాభా!

- 147 కోట్లు దాటేసిన భారత్ జనాభా!
- సెకనుకోసారి పరుగులు తీస్తున్న జనాభా అంకెలు
- ఎయిమ్స్‌లో లైవ్ పాపులేషన్ కౌంటింగ్
- కళ్లముందే మారిపోతున్న జనాభా లెక్కలు
- జనాభా పెరుగుదలపై షాకవుతున్న నెటిజన్లు
- భవిష్యత్‌లో ఉద్యోగాలు, వైద్యంపై పెను సవాల్
- మౌలిక వసతులపై జనాభా పెరుగుదల ప్రభావం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన డిజిటల్ క్లాక్

2 లో

## తెలంగాణపై వర్ష మేఘాలు!




2 లో

**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే శుభవార్త తెలిపింది.

## ప్రేమికుడిపై నూనె పోసిన తల్లి!



2 లో

- పెళ్లి మాట కోసం వస్తే.. దారుణంగా దాడి
- కుమార్తె ప్రేమ వ్యవహారంపై తల్లి ఆగ్రహం
- వంటగదిలోని వేడి నూనెతో కర్కశ దాడి
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి యువకుడు
- స్థానికులు రక్షించి ఆస్పత్రికి తరలింపు
- తల్లిపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- కేసు నమోదు.. దర్యాప్తు ముమ్మరం



## ఎస్ఐఆర్‌తో ఓట్ల కలకలం!

**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో జరుగుతున్న 'ఎస్ఐఆర్' ప్రక్రియలో మరో 25 లక్షల వరకు ఓట్లు తొలగించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 47 లక్షల మంది ఓటర్లకు మాత్రమే అందాయి. వీరిలో కేవలం 9 లక్షల మంది మాత్రమే అందుకున్న నోటీసులకు సమాధానం అందించారు. అయితే, కొన్ని చోట్ల నోటిసులకు సమాధానం ఇవ్వడానికి ఓటర్లు ముందుకు రావడంలేదని ఎన్నికల అధికారులు గుర్తించారు. ఓటర్లు ఆసక్తి చూపించడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 16న నోటీసుల ప్రక్రియ పూర్తికానుంది. అయితే, ప్రస్తుతమున్న పరిస్థితుల్లో నోటీసుల పంపిణీ, సమాధానాలు సాధ్యం కాదనే ఉద్దేశంతో మరింత సమయం ఇవ్వాలని ఈసీని కోరినట్టు తెలిసింది. నోటీసులతో విసుగు చెందిన కొందరు ఓటర్లు తమకు ఓటు హక్కు ఉన్నా, లేకున్నా పర్వాలేదు కానీ, ఇన్నిసార్లు ఓటు కోసం వెళ్లడం అవసరమా? అంటూ నిట్టూరుస్తున్నారు.

మిగతాది 2 లో..

- మరో 25 లక్షల ఓట్లపై వేటు!
- నోటీసులకు స్పందన కరువు
- జవాబివ్వకపోతే ఓటు గల్లంతే!
- 92 లక్షల మందికి నోటీసులు
- 47 లక్షలకే నోటీసుల పంపిణీ
- 9 లక్షల మంది నుంచే సమాధానాలు
- కోటి ఓట్ల తొలగింపుపై టెన్షన్
- గడువు పెంచాలని ఈసీకి లేఖ
- పార్టీల్లో మొదలైన ఆందోళన!

## ట్రాన్స్‌జెండర్ల వసూళ్లపై ఉక్కుపాదం

- స్పెషల్ డ్రైవ్‌కు ఆదేశాలు
- భిక్షాటన ముఠాలపై కొరడా
- ప్రజలను వేధిస్తే చర్యలే
- కమిషనర్లకు డీజీపీ ఆదేశం
- ఉపాధికి ప్రభుత్వం ప్రోత్సాహం
- చట్టవ్యతిరేక చర్యలపై కఠిన చర్యలు



2 లో

**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, శుభకార్యాల వద్ద ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లు, భిక్షాటన మాఫియా ఆగడాలపై నెటిజన్లు, ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. తాజాగా వారి ఆగడాలపై సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదుల వస్తున్నాయి.

## విద్యావ్యవస్థను నాశనం చేశారు

- పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆందోళన
- ఉద్యోగ నియామకాలు ఎక్కడ?
- పెరిగిన విద్యా ఖర్చులపై ఆగ్రహం
- హాస్టళ్లలో అధ్వాన్న పరిస్థితులు
- స్కాలర్‌షిప్‌లలో అవినీతి ఆరోపణలు
- ఎంఎస్‌పీఎస్‌సీపై బీజేపీ పెత్తనం
- విద్యార్థులకు కాంగ్రెస్ అండ



**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి శాంతియుతంగా ఆందోళనలు బాట పట్టడం వెనుక కేవలం ఒక్క పరీక్ష, నియామక ప్రక్రియ మాత్రమే కారణం కాదని, మొత్తం విద్యావ్యవస్థపైనే వారికున్న విశ్వాసం పూర్తిగా నశించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. కేంద్రంలోనైనా, రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలతో ప్రతి విద్యార్థి తీవ్రంగా నలిగిపోతున్నాడని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ధ్వజమెత్తారు. వరుస పేపర్ లీకేజీలు, నిలిచిపోయిన ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, భరించలేని విద్యా ఖర్చులు విద్యార్థులను నిలువునా దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం



# నేటి నుంచే అసెంబ్లీ హీట్!

**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈసారి అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉందని ఇప్పటికే గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో పోలీస్, ఇంటెలిజెన్స్ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని స్పీకర్ పేర్కొన్నారు. అలాగే అన్నిశాఖల అధికారులను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సారి అసెంబ్లీలో 21 ఏళ్లకే చట్ట సభలకు పోటీ చేసే అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనతో పాటు.. క్యూర్, ల్యాండ్ పూలింగ్, 22ఏ భూములు, భూసేకరణ అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఆస్తిపన్ను విధానం, హైడ్రా పాత్ర, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలు కూడా ఈ సెషన్లో కీలకంగా మారనున్నాయి.

ప్రస్తుతం రాజ్యాంగంలోని ఆర్టికల్ 84(బి), 173 (బి) ప్రకారం ఈ రెండు చట్టసభలకు పోటీ చేసే కనీస వయస్సు 25 సంవత్సరాల్లుగా ఉంది. అయితే దీనిపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసినా.. కేంద్రం, పార్లమెంట్ స్థాయిలో అవసరమైన రాజ్యాంగ మార్పులు జరగాల్సి ఉంటుంది. కాబట్టి తెలంగాణ అసెంబ్లీలో చేసే ఈ తీర్మానం కేంద్రానికి సిఫార్సుగా వెళ్లనుంది.

# ట్రాన్స్‌జెండర్ల వసూళ్లపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి

అలాంటి పిర్యాదులపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. గతంలో తాను హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలోనూ ఇలాంటి ఫిర్యాదులు భారీగా రావడంతో భిక్షాటన ముఠాలు, బలవంతపు వసూళ్ల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అడ్డుకట్ట వేశామని ఆయన తన ట్వీట్ ద్వారా గుర్తుచేశారు. ఇటీవల మళ్లీ ఈ తరహా వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కమిషనరేట్లలోని పోలీసు కమిషనర్లకు వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశాలు జారీ చేయనున్నట్లు డీజీపీ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలను, వాహనదారులను వేధింపులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదే సమయంలో ట్రాన్స్‌జెండర్లను సమాజంలో గౌరవప్రదమైన ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని డీజీపీ పేర్కొన్నారు. ఇప్పటికే వారిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, హైడ్రా (న్ణ=ూూా) విధుల్లోకి తీసుకొని ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని తెలిపారు. అక్కడ బాధ్యతలు చేపట్టిన ట్రాన్స్‌జెండర్లు ఎలాంటి ఫిర్యాదులు లేకుండా అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన ప్రశంసించారు. సమాజంలో గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ, కొందరు అసాంఘిక శక్తులుగా మారి భిక్షాటన ముఠాలు, దందాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఎంతమాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని డీజీపీ తన ట్వీట్ ద్వారా తేల్చిచెప్పారు.

# కేసీఆర్ మారకుంటే పదేళ్లు రోడ్లపైనే!



**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** పదేళ్లు సీఎంగా పని చేసిన కేసీఆర్ సభకు వచ్చి వారి అనుభవాన్ని పంచుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కేసీఆర్ శాసనసభకు రాకుండా ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారని నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహా ధర్నా'లో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదని సభకు వస్తే సమాధానం చెప్తామన్నారు. కేసీఆర్ వైఖరి మారకుంటే మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారన్నారు. విపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విషప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

పదేళ్లు చేయని మీరు ఇప్పుడు రెచ్చగొడతారా?:

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జవాబుదారీతనంతో పని చేస్తోందని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సులో కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఉచిత ప్రయాణం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వని దౌర్భాగ్య పాలన పదేళ్ల పాటు సాగిందని ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్న అంశాలను పదేళ్ల పాటు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలకు రేషన్ కార్డు రాలేదా? సన్న బియ్యం తీసుకోవట్లేదా అని ప్రశ్నించారు. పదేళ్లు ఉద్యోగులు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు యువతను రెచ్చగొడుతోందని మండిపడ్డారు.

# విద్యావ్యవస్థను నాశనం చేశారు

మొదటి పేజీ తరువాయి

అలాగే వసతి గృహాల్లో (హాస్టళ్లలో) అమానవీయ పరిస్థితులు నెలకొన్నాయని, విషతుల్యమైన ఆహారం సరఫరా చేస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, డీబీటీ స్కాలర్‌షిప్ పథకాల్లో సైతం అవినీతి, మోసాలు రాజ్యమేలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వంటి అత్యున్నత సంస్థపై కూడా పెత్తనం చెలాయిస్తూ, దాని విశ్వసనీయతను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. తమ ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థులు చేస్తున్న ప్రతి డిమాండ్ పూర్తిగా సమంజసమైనదని, వారికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల గళాన్ని ఆలకించి, సమస్యల పరిష్కారానికి తక్షణమే పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఒకవేళ నిర్లక్ష్యం వహిస్తే న్యాయం జరిగేంత వరకు విద్యార్థుల తిరుగుబాటు నినాదాలు, ఆందోళనలు దేశవ్యాప్తంగా మరింత తీవ్ర రూపం దాల్చుతాయని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

# తెలంగాణపై వర్ష మేఘాలు!

మొదటి పేజీ తరువాయి




సెప్టెంబర్ మూడో వారం నుంచి (ముఖ్యంగా సెప్టెంబర్ 11, 12 తేదీల తర్వాత) ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ నాలుగో వారం వరకు కొనసాగుతుందని, కనీసం 6 నుంచి 7 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా విస్తారమైన వర్షాలు, మిగిలిన రోజుల్లో మోస్తరు జల్లులు కురుస్తాయని తెలంగాణ వెదరమ్యాన్ అంచనా వేశారు. దీంతో ఈ ఏడాది గణేష్ నవరాత్రుల వేళ వర్షాలు నిరాశపరచవని, భారీ వర్షాల పరంపర తిరిగి ఊపందుకుంటుందని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు.

ఇదిలా ఉంటే రాష్ట్రంలో నేడు ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతున్నప్పటికీ రాత్రి వేళల్లో వర్షాల తీవ్రత స్వల్పంగా పెరిగే సూచనలు ఉన్నట్లు వాతావరణ నిపుణులు తెలిపారు. అధిక తేమ కారణంగా నేటి రాత్రి నుంచి రేపు తెల్లవారుజాము వరకు వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండ, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన చెదురుమదురు వర్షాలు పడే అవకాశముంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సాధారణ వాతావరణం నెలకొన్న ప్పటికీ, అర్ధరాత్రి వేళల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# కళ్లముందే పెరుగుతున్న జనాభా!




**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** భారత దేశంలో శరవేగంగా పెరుగుతున్న జనాభాకు అద్దం పడుతూ ప్రముఖ వైద్య విద్యాసంస్థ 'ఎయిమ్స్' ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిజిటల్ పాపులేషన్ క్లాక్ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా చక్కర్లు కొడుతోంది. ఈ భారీ డిజిటల్ స్క్రీన్‌పై దేశ జనాభా క్షణక్షణానికీ ఎలా మారిపోతుందో 'లైవ్ కౌంటింగ్' ద్వారా కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. సెకను సెకనుకు డిజిటల్ నెంబర్లు పరుగులు తీస్తూ భారత్ జనాభా ఏకంగా 147 కోట్లను (147,92,39,020) దాటేసినట్లు చూపిస్తున్న దృశ్యాలు నెటిజన్లను విస్మయానికి గురి చేస్తున్నాయి. దేశంలో జనన, మరణాల రేటును శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషిస్తూ నిరంతరం అప్‌డేట్ అయ్యేలా ఈ డిజిటల్ వ్యవస్థను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించారు.

ఒక్క సెకనులో జనాభా అంకెలు మారిపోతుండటం చూసి నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. "ఒకవైపు దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంటే.. మరోవైపు జనాభా పెరుగుదల రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోతోంది" అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భవిష్యత్తులో ఉద్యోగాలు, వైద్యం, మౌలిక వసతులు, నివాస సదుపాయాల కల్పన ఎంత పెద్ద సవాలుగా మారనుందో ఈ డిజిటల్ క్లాక్ గుర్తుచేస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ జనాభా పరిమాణం, కుటుంబ నియంత్రణ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన ఈ లైవ్ బోర్డు విజువల్స్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌గా మారాయి.

# జైలు కోసం చోరీ.. యువతి అరెస్ట్!



**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఇటీవల కాలంలో రకరకాల వింత దొంగతనాలు సోషల్ మీడియాలో చూస్తూనే ఉన్నాం. అయితే తాజాగా రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఓ షాకింగ్ చోరీ యత్నం వెలుగు చూసింది. కస్టమర్ మాదిరిగా నటిస్తూ జ్యువెలరీ షాప్‌లోకి వచ్చిన ఓ యువతి రూ.20 లక్షల విలువైన బంగారు ఉంగరాల బాక్స్‌తో పరారైంది. అయితే వ్యాపారి ఆమెను వెంటాడి పట్టుకుని పోలీసులకు అప్పగించగా ఆమె చెప్పిన కారణం విని అంతా షాక్?కు గురయ్యారు. అసలేం జరిగిందంటే.. జైపూర్ శివారు రోడ్డులోని లక్ష్మీ నగర్‌లో త్రిలోక్ చంద్ ప్రజాపత్ (37) అనే వ్యక్తి భవానీ జ్యువెలర్స్ పేరుతో బంగారు దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ షాప్ కు ఇటీవల ఉంగరం కొనే నెపంతో ఓ యువతి వచ్చింది. తనకు ఉంగరాలు చూపించాలని కోరింది. దీంతో త్రిలోక్ చంద్ 25 బంగారు ఉంగరాలు ఉన్న బాక్స్‌ను ఆమె ముందుకు తెచ్చి పెట్టాడు.

యజమాని దృష్టి మళ్లగానే..

అందులో నుండి రెండు ఉంగరాలను సెలెక్ట్ చేసుకున్న సదరు యువతి వాటి ధరల వివరాలు అడిగి తెలుసుకుంది. ఆన్?లైన్ పేమెంట్ చేయడానికి తన తండ్రికి ఫోన్ చేస్తానని చెబుతూ ఈ క్రమంలో బాక్కులో ఉన్న ఉంగరాలను పరిశీలిస్తున్నట్లు నటించింది. అయితే అంతలో యజమాని త్రిలోక్ దృష్టి వేరే కష్టమర్ పైకి మళ్లడంతో ఇదే అదునుగా భావించిన యువతి రూ.20 లక్షల విలువైన ఉంగరాల కలిగిన సదరు బాక్స్‌ను పట్టుకుని షాప్ నుంచి బయటకు పరుగులు తీసింది.

500 మీటర్లు చేజింగ్:

వెంటనే అప్రమత్తమైన త్రిలోక్ చంద్, తన ఉద్యోగితో కలిసి ఆమెను వెంబడించారు. దాదాపు 500 మీటర్ల దూరం పరుగెత్తి ఆమెను పట్టుకుని, నగల బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను జోత్‌వారా పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన తర్వాత ఆ యువతి నేను జైలుకు వెళ్లాలనుకుంటున్నాను.. అందుకే ఈ పని చేశాను అని వ్యాపారితో చెప్పింది. దీంతో ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో కారం పొడి, స్ప్రే బాటిల్ లభ్యమయ్యాయి. పారిపోవడానికి ముందే ఆమెకు ఫోన్ కాల్ వచ్చిందని, జన సమూహం ఆమెను వెంటాడటం చూసి ఆమెతో పాటు వచ్చిన మరో వ్యక్తి పరారయ్యాడని షాప్ యజమాని తెలిపారు. ఈ దొంగతనానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేప్టటారు.

# ప్రేమికుడిపై నూనె పోసిన తల్లి!




**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** కుమార్తెను ప్రేమించిన యువకుడిపై.. ఆమె తల్లి దారుణానికి పాల్పడింది. రెండేళ్లుగా ఇద్దరూ ప్రేమించుకుంటుండగా.. పెళ్లి విషయమై మాట్లాడేందుకు వచ్చిన యువకుడిపట్ల కర్కశంగా ప్రవర్తించింది. అతనిపై వేడి వేడి నూనె పోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన తమిళనాడులోని రాణిపేట జిల్లా కావేరిపాక్కంలో చోటుచేసుకుంది. ఉత్తిరంపట్టు గ్రామానికి చెందిన దమీమ్ (36) అనే మహిళ భర్త మరణించాడు. తన కుమారుడు, కుమార్తె (18)తో కలిసి జీవిస్తోన్న ఆమె.. మూడు నెలల క్రితం కావేరిపాక్కంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఒచ్చేరి సమీపంలోని ఆయర్ పాడికి చెందిన లోకేశ్ (19), దమీమ్ కుమార్తె రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం లోకేష్ ప్రియురాలి ఇంటికి వెళ్లి.. కుమార్తెనిచ్చి పెళ్లి చేయాలని కోరాడు. తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె.. వంట గదిలో మరుగుతున్న నూనెను తెచ్చి యువకుడిపై పోసింది. అతను లబోదిబోమని కేకలు వేయడంతో.. స్థానికులు రక్షించి.. వాలాజాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడు శనివారం రాత్రి పోలీసులకు కంప్లైంట్ చేయగా.. దమీమ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్‌లో మరో నలుగురు నేతలకు షోకాజ్ నోటీసులు



**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** కాంగ్రెస్ పార్టీలో మరో నలుగురు నేతలకు షోకాజ్ నోటీసులు అందాయి. ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కంది శ్రీనివాస్‌కు క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారని నోటీసులు అందజేసింది. గత కొంతకాలంలో ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. ఉట్నూరులో ఇటీవల జరిగిన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఈ ఇద్దరు నేతల మధ్య వాగ్వాగం జరిగింది. సమావేశానికి ఆహ్వానం లేకపోయినా సంజీవరెడ్డి వచ్చారంటూ కంది శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది.

ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలోనే ఒకరినొకరు దూషించుకున్నారు. దీంతో వివరణ కోరుతూ ఇద్దరికీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. మరోవైపు గజ్వేల్ నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డికి సైతం క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. నర్సారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మల్లారెడ్డి పీసీసీకి ఫిర్యాదు చేయడంతో ఇద్దరికీ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే మంత్రి పదవి నుండి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో పార్టీ నేతల్లో గుబులు పుట్టగా తాజాగా మరికొందరు నేతలకు నోటీసులు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.

# అసెంబ్లీలో కేసీఆర్ బిగ్ ప్లాన్!

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేసిన కేసీఆర్ .. యువత, రైతులు, విద్యార్థులు, మహిళల సమస్యలను లేవనెత్తాలని సూచించారు.

అంతేకాదు, 22ఏ భూముల అంశంపై సభను స్థంభింపజేయాలని, కాంగ్రెస్ సర్కారు హామీలు, పెండింగ్ పథకాలపై నిలదీయాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్‌పై పోరాటానికి వ్యూహరచన చేసినట్టు తెలుస్తోంది. ఈసారి కూడా అసెంబ్లీకి హాజరుకాకూడదని ఆయన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఫాంహౌస్ నుంచే పార్టీ వ్యూహం రచిస్తారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

అలాగే, అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని, శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గులాబీ బాస్ ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాలను ఎవ్వరూ లైట్‌గా తీసుకోవద్దని, ఉభయ సభల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. ప్రజల అజెండానే బీఆర్ఎస్ ఎజెండాగా ఉండాలని తెలిపారు. "సీఎం రేవంత్ రెడ్డి బయట, అసెంబ్లీలో చిల్లర బూతు మాటలు మాటాడుతున్నాడు.. నీచుడు.. పాలన చాతకాకే ఈ బూతులు.. 1000 రోజుల కాంగ్రెస్ పాలన డిజాస్టర్, అట్టర్ ఫెయిల్యూర్.. కాంగ్రెస్ పోవడం ఖాయమని అర్థమైంది.. అందుకే ఈ దోపిడీ.. కాంగ్రెస్ ది థర్డ్ క్లాస్ పాలన.. ఆ బూతుల వీరుడితో చర్చలకు అసెంబ్లీకి రమ్మంటున్నారు.. అవసరమా..? నా చావు కోరుతూ పదేపదే స్పీచులు.. అసెంబ్లీకి రావాలని ధర్నాలు" అని కేసీఆర్ అన్నారు.

"ప్రతి పక్షంలో ఉన్న తమకు సంఖ్యాబలమే ముఖ్యం.., ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది.. ఆ విషయం అసెంబ్లీలో చెప్పే బాధ్యత ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా తీసుకోవాలి.... ఉభయ సభలలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి" అని కేసీఆర్ సూచించారు.

# పేపర్ మిల్లుపై పీసీబీ కొరడా!




**న్యూస్ డెస్క్, 06 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ మిల్లుపై కాలుష్య నియంత్రణ మండలి కఠిన చర్యలు చేపట్టింది. పర్యావరణ నిబంధనలను పదేపదే ఉల్లంఘించిందని నిర్ధారించిన పీసీబీ.. పేపర్ మిల్లు పరిశ్రమకు రూ.21 కోట్లకు పైగా పర్యావరణ పరిహారం విధించింది. గోదావరిలో వ్యర్థాల విడుదలకు అనుమతి లేదని స్పష్టం చేస్తూ.. కాలుష్య నియంత్రణ చర్యలను మరింత కఠినతరం చేసింది.

రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ మిల్లుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రూ.21.01 కోట్ల పర్యావరణ పరిహారం క్రింద జరిమానా విధించింది. పర్యావరణ నిబంధనలను పదేపదే ఉల్లంఘించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పీసీబీ వెల్లడించింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మే 26న తూర్పులంక ఇసుక మేటలు, పరిసర ప్రాంతాలను పరిశీలించిన సందర్భంగా గుర్తించిన పర్యావరణ ఉల్లంఘనలపై పీసీబీ మే 28, జూన్ 12 తేదీల్లో ఆంధ్రా పేపర్ మిల్లుకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వ్యర్థాల పారవేతకు ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

సంస్థకు లోపాలు సరిదిద్దుకునేందుకు తగిన సమయం, అవకాశాలు కల్పించినప్పటికీ సెప్టెంబర్ 3న నిర్వహించిన తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో పర్యావరణ పరిహారంగా రూ.21.01 కోట్ల జరిమానా విధించారు. గోదావరి పరిసరాల్లో వ్యర్థాలను విడుదల చేసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని పీసీబీ స్పష్టం చేసింది. పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీ ఉండదని, భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించింది.

# ఓట్లపై భారీ వేటు!

మొదటి పేజీ తరువాయి



దూరప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వెళ్లినవారు రూ.వందలు, వేలు ఖర్చు చేసి రావడం.. వ్యాపారం, ఉద్యోగానికి ఒక రోజు సెలవు పెట్టి రావాల్సి ఉండటంతో నోటీసులకు సమాధానాలు ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదని అధికారులు గుర్తించారు.

జవాబివ్వకపోతే ఓటు గల్లంతు..

కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన వెసులుబాటులో భాగంగా అధికారులు ఇచ్చిన నోటీసుకు సమాధానం ఇవ్వలేకపోతే మరొక తేదీని ఇచ్చే అవకాశం ఎన్నికల అధికారులకు ఉంది. ఈ నేపథ్యంలో రెండోసారి నోటిసు ఇచ్చినా ఓటర్లు వస్తారా? లేదా? అనే అపనమ్మకం అధికారుల్లో మొదలైంది. ఎన్యూమరేషన్? ఫారాన్ని బీఎల్‌వో నుంచి తెచ్చుకోవడం, దానిని నింపడానికి, తిరిగి ఇవ్వడానికే జనాలు నానా తిప్పలు పడ్డారు. తాజాగా మరోసారి నోటీసు పేరుతో స్వయంగా రావాలని చెప్పడంతో ఓటర్లకు చిర్రెత్తుకోస్తుంది. ఇంకా 45 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సి ఉంది. నోటీసులు ఇచ్చిన 47 లక్షల్లో కేవలం 9 లక్షల మంది మాత్రమే సమాధానం చెప్పేందుకు రావడంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే రాష్ట్రంలో 72 లక్షల ఓట్లు తొలగిపోయాయి. నోటీసులకు సమాధానాలు ఇవ్వని వారు దాదాపుగా 25 నుంచి 30 లక్షల మంది వరకు ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకున్న నోటీసులకు ఓటర్లు స్వయంగా వచ్చిన సమాధానాలు ఇవ్వలేకపోతే వారి ఓటును కూడా తొలగిస్తారు. ఫలితంగా రాష్ట్రంలో కోటి వరకు ఓట్లు డిలీట్ కానున్నాయి. ఇన్ని ఓట్లు తొలగతుండటంతో పొలిటికల్ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నోటీసుల విధానంపై కూడా ఆందోళన వ్యక్తం చేశాయి. ఓటర్లు స్వయంగా రావడమనే నిబంధనను పూర్తి తొలగించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశాయి. స్వయంగా రాకుంటే ఓట్లు తొలగిస్తామని చెప్పడాన్ని పార్టీలన్ని ప్రశ్నించాయి. వృద్ధులు, వికలాంగులకు, ఎన్ఆర్ఐ ఓటర్లకు ఇచ్చిన వెసులుబాటునే అన్ని వర్గాలకు ఇవ్వాలని, కుటుంబంలో ఎవరు వచ్చినా నోటీసుకు సమాధానం ఇచ్చినట్టుగా పరిగణించాలని కోరాయి.

ఎస్ఐఆర్ గడువు పొడగించండి

రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును పొడిగించాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను సీఈవో సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ మేరకు లేఖ రాశారు. కనీసం మూడు వారాల సమయాన్ని పొడిగించాలని కోరారు. తెలంగాణలో 92 లక్షల ఓటర్లకు నోటీసులు ఇవ్వడం, వారు సమాధానాలు ఇవ్వాల్సి ఉందని, ఈ నేపథ్యంలో గడువు పొడగించడం అనివార్యమని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఇప్పటివరకు కేవలం 47లక్షల ఓటర్లలో 9 లక్షల మంది మాత్రమే సమాధానాలు ఇచ్చారని వివరించారు. రాష్ట్రంలోని అనేక పార్టీలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గడువు పొడగించాలని ఈసీకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో పార్టీలు, అధికారుల పక్షాన మరికొంత వెసులుబాటు కల్పించడానికి నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండటానికి వీలుగా గడువును పొడగించాలని కోరారు. రాష్ట్రంలో అదనంగా ఏఈఆర్‌వోలను నియమించుకున్నా... నోటీసుల ఆధారాలను పరిశీలించడానికి ఎక్కువ సమయం పడుతుందని, అందుకే మూడు వారాల సమయం ఇవ్వాలని కోరారు. కాగా, సీఈవో లేఖపై కేంద్రం ఎన్నికల సంఘం స్పందించాల్సి ఉంది.

# ఏకల్ అభియాన్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి: విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతూ సమాజ ప్రగతికి పునాది వేస్తున్న ఉపాధ్యాయులను ఏకల్ అభియాన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పిపైన్ ప్రభాగ్, ఉత్తర తెలంగాణ సంభాగ్, కామారెడ్డి అంచల్ పరిధిలోని ఎల్లారెడ్డి సంచ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాబోధనతో పాటు విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంభాగ్ ప్రాథమిక శిక్షా ప్రముఖ్ ప్రొఫెసర్, కామారెడ్డి జిల్లా అంచల్ అధ్యక్షుడు గాజుల రాజు, ఉపాధ్యాయులు నటరాజ్, సంధి మల్లికార్జున్, అరవింద్, ఏకల్ అభియాన్ ప్రముఖ్ కే. అంజయ్య, ఎల్లారెడ్డి సంచ్ ప్రముఖ్ వెంకట్రాములు, కామారెడ్డి అంచల్‌కు చెందిన కార్యకర్తలు, మాతాజీలు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ

- తక్షణ విచారణకు స్థానికుల డిమాండ్



ఇది కద నిజం: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, పేట్‌బషీరాబాద్ గ్రామ పరిధిలోని 25/1 రంగారెడ్డి బండ ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై స్థానికంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. రాజీవ్ గృహకల్ప పథకానికి కేటాయించిన స్థలంలో సుమారు 5 ప్లాట్లకు సంబంధించి దాదాపు 500 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మార్కెట్ విలువ గజానికి రూ.1 లక్షకు పైగా ఉంటుందని, కోట్ల రూపాయల విలువైన ప్రజా ఆస్తి హరించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆక్రమణల పర్వం అంతటితో ఆగకుండా, అదే ప్రాంతానికి సమీపంలో ఉన్న మరో 1,000 గజాల విలువైన కమర్షియల్ స్థలాన్ని కూడా దక్కించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఆనంద్ అనే వ్యక్తి ఇటీవల రాత్రికి రాత్రే అక్కడ చిన్నపాటి షెడ్ నిర్మించి స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక కొంతమంది స్థానిక రాజకీయ నాయకులు, వారి అనుచరుల హస్తం ఉందనే ప్రచారం కూడా జోరందుకుంది. ఈ వ్యవహారంపై జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హౌసింగ్ మరియు సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి స్వతంత్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పహాణీలు, సర్వే రికార్డులను పరిశీలించాలని, ప్రభుత్వ భూమి హద్దులను స్పష్టంగా నిర్ధారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ షెడ్లను వెంటనే తొలగించి, ఆక్రమణదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించి, విచారణ నివేదికను ప్రజలకు వెల్లడించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# హత్యకు గురైన నర్స్ శిరీషకు న్యాయం చేయాలి

- బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని జనసేన నాయకుడు భూమగళ్ల రామకృష్ణ, సినీ నటులు తనీష్ నిరసన



ఇది కద నిజం: భద్రాచలానికి చెందిన గిరిజన యువతి శిరీష తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నర్సుగా సేవలందిస్తోంది. అయితే రెండు రోజుల క్రితం ఒక అపరిచిత వ్యక్తి ఆమెపై బలవంతంగా అత్యాచారానికి ఒడిగట్టి, అనంతరం దారుణంగా హత్య చేశాడు. ఆసుపత్రి యాజమాన్యం సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడం, కనీస భద్రత లేకపోవడమే ఈ ఘోరానికి ప్రధాన కారణమని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిసిటివి కెమెరాలు పనిచేయకపోవడం, సిబ్బందికి సురక్షితమైన గదులు లేకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. శిరీష గిరిజన బిడ్డ కావడం వల్లే అధికారులు, యాజమాన్యం నిర్లక్ష్యం వహించారని, అదే ఏ రాజకీయ నాయకుడి లేదా అగ్రవర్ణాల కుమార్తె అయి ఉంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకునేవారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ?ఈ ఘోర ఉదంతంపై స్పందించిన జనసేన పార్టీ నాయకులు, సినీ నటులు తనీష్, జనసైనికులు బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లేడు చౌదరిగుడ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు భూమగళ్ల రామకృష్ణ మాట్లాడుతూ తుక్కుగూడ ప్రైమ్ కేర్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్న గిరిజన యువతి శిరీషపై క్రూరుడు దారుణంగా అత్యాచారం చేసి హత్య చేయడం అత్యంత హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. నిందితుడికి వెంటనే మరణశిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మహిళా సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆసుపత్రుల్లో కఠినమైన భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# మిస్టర్ డీజీపీ నన్ను అసభ్యంగా కామెంట్ చేసిన పోలీస్ ను అరెస్ట్ చెయ్యి

- పరీక్ష పాస్ అయి డీజీపీ అయినవా.. రికమండేషన్ లో జాబ్ లోకి వచ్చినవా
- అధికారం కోసం ఉద్యమకారులను వాడుకోని రేవంత్ రెడ్డి మోసం చేశాడు
- అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణీత కాల వ్యవధితో కూడిన స్పష్టమైన హామీ ఇవ్వాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం,హైదరాబాద్:
తనపై అసభ్యకరంగా కామెంట్లు చేసిన కానిస్టేబుల్ ను రాష్ట్ర డీజీపీ కేవలం సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవటంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా కేసు పెట్టకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. అసలు పరీక్ష పాసయ్యే ఆయన డీజీపీ అయ్యారా? ఆయనకు చట్టం తెలుసా అని కవిత నిలదీశారు. వెంటనే కానిస్టేబుల్ పై చర్యలు చేపట్టకుంటే అంతర్జాతీయ వేదికల్లో ప్రభుత్వం పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. అధికారం కోసం రేవంత్ రెడ్డి ఉద్యమకారులను వాడుకొని మోసం చేశాడని కవిత అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో వారికి నిర్ణీత కాల వ్యవధితో కూడిన స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## పరీక్ష పాసయ్యే డీజీపీ అయ్యారా?

సోషల్ మీడియాలో తనను అసభ్యంగా దూషించిన కానిస్టేబుల్ పై వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అంత అసభ్యంగా కామెంట్లు చేసిన వ్యక్తిని కేవలం సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటారా అని ప్రశ్నించారు. అతనిపై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. భారత న్యాయ సంహిత సెక్షన్ 356, సెక్షన్ 79, ఐటీ చట్టాలు ఏం చెబుతున్నాయో డీజీపీ చదువుకోవాలని సూచించారు. మహిళలను ఒక్క పదం అసభ్యంగా మాట్లాడిన సరే 3 ఏళ్ల పాటు శిక్ష వేసేలా చట్టాలు ఉన్నాయని అవి డీజీపీకి తెలియదా? అంటూ కవిత నిలదీశారు. అసలు డీజీపీ పరీక్ష పాసయ్యే పోలీసు అధికారి అయ్యాడా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. 20 ఏళ్లు ప్రజా జీవితంలో ఉండి, ఎంపీగా ఎమ్మెల్సీ, ఒక పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న తనకే రక్షణ లేకపోతే...సాధారణ మహిళలకు ఏం రక్షణ ఇస్తారని నిలదీశారు. మీకు కూడా ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిని కూడా ఇలాగే కామెంట్లు చేస్తే వదిలేస్తారా అంటూ కవిత అడిగారు. ఈ విషయంలో డీజీపీ బాధ్యత లేకుండా సెన్సిబులిటీ లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కానిస్టేబుల్ పై కేసు పెట్టి చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ వేదికల్లో ప్రభుత్వం పరువు తీస్తానని కవిత హెచ్చరించారు. ఇప్పుడున్న డీజీపీ బాధ్యతలు చేపట్టిన తర్వాతే రాష్ట్రంలో క్రైమ్ రేటు పెరిగిందని కవిత అన్నారు. ఖమ్మం వెళ్లి స్వయంగా డీజీపీయే రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ పెరిగిందంటూ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. గంజాయి స్మగ్లింగ్ ను అరికట్టాల్సిందెవరంటూ కవిత ప్రశ్నించారు. అటు హేట్ స్పీచ్ ను అరికట్టేందుకు ముఖ్యమంత్రి తీసుకొస్తామని చెప్పిన బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తేవాలన్నారు.

## ఉద్యమకారులకు నిర్ణీత కాలవ్యవధితో కూడిన వాగ్దానం చేయాలి

అధికారంలోకి రావటానికి తెలంగాణ ఉద్యమకారులను రేవంత్ రెడ్డి ఉపయోగించుకున్నారని కవిత అన్నారు. ఎన్నికలకు ముందుకు దాదాపు వాళ్ల కాళ్లు పట్టుకున్నంత పనిచేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు తెలంగాణ ఉద్యమంతో సంబంధమే లేని రేవంత్ రెడ్డి ఉద్యమకారులు నమ్మలేదని కవిత అన్నారు. ఆయన పక్కన కోదండ రాం సర్ ను చూసి రేవంత్ రెడ్డిని నమ్మారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్న వారికి చీమకాలంత పనికూడా చేయలేదని విమర్శించారు. ఇప్పటికే ఎన్నో ఉద్యమాలు చేసిన ఉద్యమకారులు ఇంకా వాళ్లకు ఇచ్చిన హామీల కోసం ఉద్యమాలు చేయాలా? అని ప్రశ్నించారు. ఇక వారికి ఆమరణ దీక్ష ఒక్కటే మిగిలిందన్నారు. ఉద్యమకారుల కోసం తాము భూపోరాటం చేస్తే ఉద్యమకారులపై లాఠీలు ఝుళిపించారని కవిత గుర్తుచేశారు. ఉద్యమకారుల జీవితాలు ఇప్పటికే ఆగమాయయ్యాని వారిపై లాఠీలు ఝుళిపిస్తే లాభమెంటనీ ప్రశ్నించారు. తెలంగాణ జన సమితి తరఫున ఉద్యమకారులకు ఐటెంటీలు కార్డులు ఇచ్చిన కోదండ రాం సార్ వాటినే ఇప్పుడు ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వటం లేదో చెప్పాలన్నారు. ఆయన ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నారని ఉద్యమకారులకు మేలు చేయాలని కోరారు. కేకే కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా ఉద్యమకారులకు మేలు చేసే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇప్పటికే ఎంతో మంది ఉద్యమకారుల డేటా ప్రభుత్వం వద్ద ఉందని కవిత అన్నారు. ఉద్యమకారులకు మేలు చేసేలా నిర్ణీత కాల వ్యవధితో కూడిన వాగ్దానాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి చేయాలన్నారు. లేదంటే కాంగ్రెస్ నేతలను రాష్ట్రంలో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

## బీసీ ల కోసం కాంగ్రెస్ ధర్నాలు చేస్తామనటం జోక్

రాష్ట్రంలో బీసీలను మోసం చేసిన పార్టీయే కాంగ్రెస్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించి వారి జనాభాను తక్కువ చేసి చూపిందే కాంగ్రెస్ పార్టీ అని కవిత గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినట్టే పెట్టి ఆ బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవటం లేదన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లే కార్యక్రమం కాంగ్రెస్ ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. కేంద్రం చేపట్ట కులగణనలో స్పెసిఫిక్ గా కులం అనే కాలం ఉండాలని తాము డిమాండ్ చేస్తున్నామని కవిత అన్నారు. ఐతే బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీయే ఇప్పుడు కేంద్రంపై వంద రోజుల కార్యాచరణతో ఆందోళన చేస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అటు అసెంబ్లీ ప్రజా సమస్యలు చర్చకు రాకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ లు నాటకాలు ఆడుతున్నాయంటూ కవిత విమర్శించారు.

# కొడంగల్ పై కవిత ఫోకస్

- ఈనెల 23న కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ
- పోస్టర్ రిలీజ్ చేసిన తెలంగాణ రక్షణ సేన చీఫ్



ఇది కద నిజం,హైదరాబాద్ :
సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఫోకస్ చేశారు. ఈనెల 23న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నారు. సభ పోస్టర్ ను ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి హాఫ్ గ్యారంటీ కూడా అమలు చేయడం లేదని అన్నారు.
బూటకపు హామీలు.. బోగస్ మాటల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై కొడంగల్ కేంద్రంగా పాంచజన్య శంఖారావం పూరిస్తున్నామని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడంతో పాటు తమ పాంచజన్యంలోని ప్రతి హామీని వంద శాతం నెరవేర్చి తీరుతామన్నారు. యువత, మహిళలు, సబ్బండ వర్గాల వికాసం, సాధికారత కలిగిన బహుజన తెలంగాణాను సాకారం చేయడమే తమ లక్ష్యమన్నారు.

## టీఆర్ఎస్ లోకి బీజేపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్ చార్జీ

బీజేపీ కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జీ ప్రభాకర్ కులకర్ణి తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఆదివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత కులకర్ణితో పాటు ఆయన అనుచరులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. కవిత నాయకత్వంలో బహుజన తెలంగాణ సాధన కోసమే తాను టీఆర్ఎస్ లో చేరానని కులకర్ణి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అర్చనా సేనాపతి, గవినోళ్ల శ్రీనివాస్, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం అభివృద్ధి పనులపై నీటిపారుదల శాఖ ప్రధాన ఇంజనీర్ క్షేత్రస్థాయి పరిశీలన

- స్నాన ఘట్టాలు, రక్షణ గోడలు, చెరువుల పునరుద్ధరణకు సర్వే
- మేడారం--ఊరట్టం ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి





ఇది కద నిజం తాడ్వాయి మేడారం, సెప్టెంబర్ 6:

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క--సారలమ్మ తల్లుల సన్నిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై నీటిపారుదల శాఖ ప్రధాన ఇంజనీర్ ధర్మ ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కుటుంబ సమేతంగా మేడారం చేరుకున్న ఆయన ముందుగా సమ్మక్క--సారలమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క పూజారులు సిద్ధబోయిన జనార్దన్, సిద్ధబోయిన భోజరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ప్రధాన ఇంజనీర్ ధర్మ మేడారం, ఊరట్టం గ్రామపంచాయతీల పరిధిలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేడారం జాతరకు వచ్చే భక్తులు, స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, వరదలు మరియు వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రక్షణ చర్యలను చేపట్టే అంశాలపై అధికారులతో చర్చించారు. జంపగవాయి గ్రామ పరిధిలో సుమారు 200 మీటర్ల మేర స్నాన ఘట్టం, ఊరట్టం గ్రామ పరిధిలో సుమారు 500 మీటర్ల మేర స్నాన ఘట్టం నిర్మాణానికి సంబంధించిన ప్రాంతాలను పరిశీలించారు. అలాగే ఊరట్టం వంతెన సమీపంలో రక్షణ గోడ నిర్మాణం, ఊరట్టం రెండు పడక గదుల ఇళ్ల సమీపంలో కరకట్ట నిర్మాణం చేపట్టే అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఊరట్టం గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులను పరిశీలించి వాటి అభివృద్ధి, పునరుద్ధరణకు అవసరమైన చర్యలపై సర్వే నిర్వహించారు. మేడారం గ్రామపంచాయతీ పరిధిలోని శివరాంసాగర్ చెరువు సుందరీకరణ, కొంగల మడుగు చెరువు పునరుద్ధరణ పనులకు సంబంధించిన ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనుల పరిమాణం, అవసరమైన నిర్మాణాలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతరతో పాటు ఏడాది పొడవునా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే ప్రాంతం కావడంతో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన, చెరువుల అభివృద్ధి, స్నాన ఘట్టాల నిర్మాణం, వరదల నుంచి రక్షణ కల్పించే నిర్మాణాలపై నీటిపారుదల శాఖ ప్రత్యేక దృష్టి సారించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ కార్యనిర్వహణ ఇంజనీర్ కొట్టెం నారాయణ, ఉప కార్యనిర్వహణ ఇంజనీర్ రవీందర్ రెడ్డి, సహాయ ఇంజనీర్ రజియా, మేడారం సర్పంచ్ పీరీల భారతి వెంకన్న, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్, యాలం రవి తదితరులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్




## 'దాదా'గా బాలయ్య బ్లాస్ట్!

నందమూరి నటసింహం బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ చిత్రంకి 'దాదా' అనే టైటిల్ ఫిక్స్ చేస్తూ ఒక వీడియో రిలీజ్ చేశారు. 'వీరసింహారెడ్డి' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో విడుదలైన టైటిల్ టీజర్ క్షణాల్లో సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించింది. అయితే, సాధారణ మాస్ ఎలివేషన్ల కంటే భిన్నంగా ఈ టీజర్‌లో చోటుచేసుకున్న ఓ తీవ్రమైన సన్నివేశం ఇప్పుడు చిత్రసీమతో పాటు నెటిజన్లలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. పోలీస్ స్టేషన్ నేపథ్యంలో సాగే సీన్. స్టేషన్ నడిబొడ్డున ఉన్న ఆఫీసర్స్ టేబుల్‌పై దర్జాగా కూర్చుని, చుట్టూ తుపాకులు ఎక్కుపెట్టి నిలబడ్డ పోలీసుల వైపే బాలకృష్ణ స్వయంగా రైఫిల్ గురిపెట్టి హెచ్చరించే విజువల్స్ పీక్స్ అనిపించేలా ఉన్నాయి. "నాకు గురిపెట్టడానికి ఒంట్లో పొగరు, వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు... బుల్లెట్స్‌కి బలుపు ఉండాలి, గన్స్‌కి గట్స్ ఉండాలి" అంటూ విసిరిన డైలాగ్ ఫాన్స్ కి ఫీస్ట్ గా ఉన్నాయి.

ఇక కంటెంట్ చూస్తుంటే కనుక ముంబై బ్యాక్‌డ్రాప్‌లో మాఫియా సామ్రాజ్యాన్ని శాసించే క్రూరమైన గ్యాంగ్‌స్టర్‌గా బాలకృష్ణ కనిపించబోతున్నారని అనిపిస్తోంది. చేతిలో గొడ్డలి, రక్తమోడుతున్న ఆయుధాలు, కళ్లజోడుతో ఇచ్చిన స్టైలిష్ మూమెంట్స్ సినిమా వయొలెన్స్ ఏ స్థాయిలో ఉండబోతోందో చాటిచెబుతున్నాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌ను మరింత వాయిలెంట్‌గా మార్చింది. డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా బాక్సాఫీస్ వద్దకు రానున్న ఈ చిత్రం, ఇప్పటివరకు ఉన్న బాలయ్య మాస్ ఇమేజ్‌ను మించి వ్యవస్థలకే సవాల్ విసిరే సరికొత్త గ్యాంగ్‌స్టర్ డ్రామాగా సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది.




## 'అంతా రాములోరు' టైటిల్ అదుర్స్!

'మ్యాడ్' సినిమాతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న యంగ్ హీరో సంగీత్ శోభన్, మాలీవుడ్ సెన్సేషన్ అనస్వర రాజన్ జంటగా ఒక కొత్త ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాకు 'అంతా రాములోరు చూస్కుంటారు' అనే ఆసక్తికరమైన టైటిల్ పెట్టినట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. దీంతో పాటు విడుదల చేసిన గ్లింప్స్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ సినిమా కథ అంతా ప్రశాంతమైన గోదావరి పరిసర ప్రాంతాల నేపథ్యంలో సాగుతుందని గ్లింప్స్ ద్వారా క్లియర్‌గా అర్థమవుతోంది. ఇక ఈ సినిమాలో సంగీత్ శోభన్ 'మారుతి' అనే లోకల్ కుర్రాడి పాత్రలో నటిస్తుండగా, అనస్వర రాజన్ 'శిరీష' అనే అమాయకమైన పల్లెటూరి అమ్మాయిగా కనిపించనుంది.

రెగ్యులర్ లవ్ స్టోరీలకు భిన్నంగా వీరిద్దరి మధ్య జరిగే ఒక క్యూట్ అండ్ బ్యూటిఫుల్ కాన్వర్సేషన్ ఆధారంగా కథ నడుస్తుందని తెలుస్తోంది. స్వచ్ఛమైన భావోద్వేగాలు, గోదావరి యాస, హీరో హీరోయిన్ల మధ్య ఉండే ఆకట్టుకునే కెమిస్ట్రీ ఈ మూవీకి మెయిన్ హైలైట్‌గా నిలవనున్నాయట. కాగా.. హిట్ ఫిలిం 'కుమారి 21ఎఫ్' తెరకెక్కించిన పల్నాటి సూర్యప్రతాప్ ఈ ఫీల్ గుడ్ లవ్ డ్రామాను తెరకెక్కిస్తున్నారు. మెలోడీ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ధీరజ్ మొగిలినేని నిర్మాణ బాధ్యతలు చేపట్టారు.

## సూరి-సుహాస్ సముద్ర వార్!

కోలీవుడ్ నటుడు సూరి హీరోగా, టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు సుహాస్ విలన్ పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'మండాడి'. సముద్రం నేపథ్యంలో రాబోతున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను 'సెల్ఫీ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి కథ అందించి దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే.. తమిళనాడులోని తీర ప్రాంతాలకు చెందిన సాంప్రదాయ బోట్ రేస్ పోటీల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సముద్రం నేపథ్యంలో సాగే హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా ఇది రూపొందుతోంది. ఇందులో సూరి సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, తెలుగు నటుడు సుహాస్‌తో పాటు ప్రముఖ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా ఇంప్రెస్సివ్‌గా ఉంది. ఈ సినిమా కోసం హీరో సూరితో పాటు నటుడు సుహాస్ ఎలాంటి బాడీ డబుల్స్ లేకుండా సముద్రంలో రిస్కీ యాక్షన్ సన్నివేశాలు, బోట్ రేస్ సీక్వెన్స్‌లలో చాలా కష్టపడి నటించినట్లు తెలుస్తుంది.








## 'మీర్జాపూర్'కు వసూళ్ల సునామీ!

ప్రముఖ వెబ్ సిరీస్ ఆధారంగా తెరకెక్కిన 'మీర్జాపూర్ ది మూవీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. తొలి రోజు మంచి ఓపెనింగ్స్ రాబట్టిన ఈ చిత్రం, రెండో రోజు కూడా అదే హవాను కొనసాగించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమా రెండో రోజు దేశీయ మార్కెట్లో రూ. 31 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లో భారత్‌లో దీని మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 56.75 కోట్లకు చేరాయి. కాగా.. కేవలం రెండు రోజుల్లోనే ఈ చిత్రం రూ. 50 కోట్ల మైలురాయిని దాటడం విశేషం. దీని ద్వారా దేశీయ గ్రాస్ వసూళ్లు రూ. 68.20 కోట్లకు చేరుకున్నాయి.

ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. రెండో రోజు విదేశాల్లో రూ. 6 కోట్లు రాబట్టడంతో, ఓవర్సీస్ గ్రాస్ మొత్తం రూ. 10.25 కోట్లకు చేరింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా తొలి రెండు రోజుల్లోనే రూ. 78.45 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించి, రూ. 80 కోట్ల మార్కుకు చేరువయింది. గుర్మీత్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ప్రేక్షకులు మరియు విమర్శకుల నుండి పాజిటివ్ రివ్యూలు వస్తుండటంతో థియేటర్లలోకి జనం భారీగా తరలివస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ 'టాక్సిక్', 'హనుమాన్ అంశ్' సినిమాలతో పాటు అర్షద్ వార్సి 'జీవన్ భీమా యోజన' చిత్రాలతో మీర్జాపూర్ పోటీపడుతోంది.

## 'ఫౌజీ'కి పోటీగా 'లెగసీ'!







ఒక సినిమా హిట్ కావడంలో కథ, హీరో, దర్శకుడు, ప్రమోషన్స్ ఎంత ముఖ్యమో.. సరైన విడుదల తేదీ కూడా అంతే కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా పెద్ద సినిమాలు ఒకేసారి బాక్సాఫీస్ బరిలోకి దిగితే థియేటర్లు, ప్రేక్షకుల విభజన, ఓపెనింగ్స్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇప్పుడు టాలీవుడ్‌లో అలాంటి ఆసక్తికరమైన రిలీజ్ క్లాష్‌పై చర్చ మొదలైంది. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ' విడుదల తేదీని డిసెంబర్ 4గా ప్రకటించడంతో ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దీనికి ప్రధాన కారణం.. సరిగ్గా ఒక్క రోజు ముందు, అంటే డిసెంబర్ 3న రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా మూవీ 'ఫౌజీ' ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించడమే.

ప్రభాస్ సినిమా అంటే కేవలం టాలీవుడ్‌కు పరిమితమైన విషయం కాదు. ఆయన సినిమాలకు దేశవ్యాప్తంగా భారీ మార్కెట్ ఉండటంతో.. పెద్ద హీరోల సినిమాలు సైతం ప్రభాస్ చిత్రాలతో నేరుగా పోటీ పడేందుకు సాధారణంగా ఆలోచిస్తుంటాయి. ముఖ్యంగా పాన్-ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న సినిమా విడుదలైనప్పుడు.. థియేటర్ల లభ్యత నుంచి ప్రేక్షకుల ఆదరణ వరకు అనేక అంశాలు ప్రభావితం కావచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో 'ఫౌజీ' విడుదలైన మరుసటి రోజే 'లెగసీ'ని తీసుకురావాలని నిర్ణయించడం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సాధారణంగా పెద్ద స్టార్ సినిమా విడుదలైతే దాని చుట్టుపక్కల కనీసం వారం, రెండు వారాల గ్యాప్ ఉండేలా ఇతర సినిమాలు తమ తేదీలను ప్లాన్ చేసుకుంటాయి. కానీ 'లెగసీ' విషయంలో మాత్రం కేవలం ఒక్కరోజు గ్యాప్ ఉండటం ఆసక్తిని పెంచుతోంది.

అయితే ఈ రిలీజ్ డేట్ వెనుక 'లెగసీ' మేకర్స్‌ది పక్కా వ్యూహమేననే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం.. 'ఫౌజీ' డిసెంబర్ 3న కచ్చితంగా విడుదల కాకపోతే, ఆ తేదీకి తమ సినిమాను తీసుకురావాలనే ఉద్దేశంతో 'లెగసీ' టీమ్ ముందుగానే డిసెంబర్ 4పై కర్చీఫ్ వేసిందనే చర్చ జరుగుతోంది.అంటే 'ఫౌజీ' అనుకున్న తేదీ నుంచి ఏదైనా కారణంతో వాయిదా పడితే.. వెంటనే ఆ డిసెంబర్ వీకెండ్‌ను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే ఆలోచన ఉండొచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.అయితే ఇది ప్రస్తుతం వినిపిస్తున్న ఇండస్ట్రీ టాక్ మాత్రమే. 'లెగసీ' టీమ్ అధికారికంగా ఈ వ్యూహంపై ఎలాంటి వివరణ ఇవ్వలేదు.ఒకవేళ ప్రభాస్ 'ఫౌజీ' అనుకున్నట్టుగానే డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలైతే, మరుసటి రోజే 'లెగసీ'ని విడుదల చేయడం అంత సులభం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.